ఓ నరుడా వానరుడా?

మునతి సత్తెయ్య ఇంటింటి ముందుకూ మర్చ కోతిని ఆడిస్తున్నాడు. కోతి చెంగు చెంగున గెంతుతోంది. కోతి మనుషి మీద పొడుగ్గా తిలకం, మెడ పట్టకి చిన్న చిన్న ముప్పలు. సత్తెయ్య వెదురుబద్దతో తాళం వేస్తూ "తనక తనకజం తనక తనకజం.... రాములోరికి దణ్ణంపెట్టు.... సీత మ్మోరికి దణ్ణంపెట్టు .... లచ్చవసామికి దణ్ణంపెట్టు" అంటూ పాడుతూ ఆడిస్తున్నాడు. ఆ ఆటకి కోతి మెడలో ముప్పలు మల్లు ఘల్లుమంటున్నాయి.

కోతికి ఓ మాసికల చొక్కా. ఆ చొక్కాకి ఓ జేబు. ఆ జేబులో శనగ పప్పులు. మధ్య మధ్య ఆట ఆపి కోతి ఓ గింజ నోట్లో వేసుకుంటుంది. ఆట ఆపంగానే సత్తెయ్య గొంతు పెంచి 'తనక తనక జల్' అంటూ టాంగున నేలమీద కొడతాడు ఉలిక్కిపడ్డట్టు కోతి అంతెత్తు ఎగిరి మళ్ళీ ఆడుతుంది. ఆ ఎగరడం చూసి పిల్లలెవరైనా 'ఇహి' అని నవ్వితే తనూ 'ఇహిహి' అని పళ్ళికిలిస్తుంది.

కొంచెం జనంచేరి ఉత్సాహంగా చూడ్డం మొదలెట్టగానే ఆట వరస మారుస్తాడు సత్తెయ్య. "నా దేవుడా ఆడరా.... తనకతనకజం....నా రావుడా ఆడరా.... నా కొడకా ఆడరా.... నా పెళ్ళాం ఆడవే" అనంగానే కోతికి ఎంత కోపమో! ఆట ఆపి పళ్ళు బిగబట్టి "కరుస్తా" అన్నట్టు ఎగిరి సత్తెయ్య మీదకి దూకుతుంది. ఆ కోపమూ, ఆ కరవబోవడము అది కూడా ఆటలో భాగమే! అలా నేర్పాడు సత్తెయ్య.

అల్లాపతి ఇంటిముందు ఆడించుకుంటూ ఒంటిగంటవేళ కృష్ణ వొడ్డుకొచ్చి అన్నం వండుకుని కోతికిపెట్టి తను తిని, కోతిని గుండెలమీద పడుకో బెట్టుకుని చింతచెట్టు కింద పడుకుని వాలుపైతాడు సత్తెయ్య.

ఎక్కడిదీ కోతి? ఎక్కడపుట్టి ఎక్కడ పెరిగిందో!

సత్తెయ్యకి అటువాడూ, ఇటువాడూ అంతా వెళ్ళిపోయాక, తనొక్కడే ఈ భూమ్మీద ఎందుకు మిగిలాడో తెలియని సమయంలో పొట్ట గడవాలి. కాబట్టి అడవిలో కట్టెలు కొట్టి తెచ్చేవాడు. సంవత్సరం క్రితం కట్టెలమోపు వెత్తిన పెట్టుకు తిరిగొస్తుంటే ఓ చెట్టుమీంచి కోతి కట్టెల మోపుమీదికి దూకింది. కంగారు పడ్డ సత్తెయ్య కట్టెలమోపు వదిలేశాడు. మోపుతో కిందకుపడ్డ కోతి మళ్ళీ ఎగిరి సత్తెయ్య భుజంమీదికి వచ్చింది. ఎంత అదిలించినా వదల్లేదు. కిచకిచ నవ్వింది. కళ్ళలో కళ్ళుపెట్టి చూసింది, అంతే! సత్తెయ్య దాన్ని ఆప్యాయంగా నిమిరి చంకలో పెట్టుకు తీసుకొచ్చాడు.

కోతికి పాత గుడ్డలతో చొక్కాకుట్టాడు. తనతోపాటు అన్నం అలవాటు చేశాడు. ఒకే కంచంలో తినేవా రిద్దరూ. తనోముద్ద కోతినోటి కందిస్తే కోతిలేచి తన చిట్టి చేతుల్తో నాలుగు మెతుకులు సత్తెయ్య నోట్లో పెట్టేది.

ఆర్నెల్ల క్రితం సత్తెయ్యకి వయసు పైపడ్డది. సత్తువ మాయమయింది. కట్టెలు కొట్టి తేలేక దిగులుగా నీరసంగా కూర్చున్న సత్తెయ్య ముందు కోతి చెంగు చెంగున తాళానికి ఎగరటం చూసి సత్తెయ్య కళ్లు మెరిశాయి. ఆనాటినించి కోతినాడిస్తున్నాడు, కోతి కష్టం తను తింటున్నాడు.

గుండెలమీద పడుకున్న కోతిని ప్రేమగా నిమురుతూ సత్తెయ్య అన్నాడు. "ఈ ముసలిబాగులోడు ఆఖరి రోజుల్లో గంజిలేక పచ్చిపోతాడని అడవిలోంచి పరుగెత్తుకొచ్చావురా! నా దేవుడా! నా దేవుడా" అంటూ కళ్ళు నీళ్ళయిపోయాడు!

పండగొచ్చింది. కోతికి మాసికల చొక్కా ఉతికి తొడిగాడు. తిలకం మీద తిలకం దిద్దాడు. జేబునిండా శనగపప్పు పోశాడు. కొత్త పెళ్ళికొడుకులా మహా సంబరంగా వుంది కోతి. అంత సంబరంతో ఆడిస్తున్నాడు సత్తెయ్య. "తనక తనకజం" కోతి చిందులు తొక్కుతోంది. హొయలు పోతోంది. సిగ్గు పడిపోతోంది. గాలిలో ఎగురుతోంది. మొగ్గలేస్తోంది. పల్టీలు కొడ్తోంది. కిచకిచ నవ్వుతోంది. ఎగరేసిన రేగిపండు ఎగిరి అందుకుంటోంది. జనం ఊగిపోయేట్టు ఆడుతోంది. సత్తెయ్య జోలె నిండిపోతోంది. పప్పులు, కూరలు, లడ్లు, బొబ్బట్లు, గారెలు.

ఆనందంగా క్రిష్ణ వొడ్డుకొచ్చి జోలె వంచుకుని తినటం మొదలెట్టా రిద్దరూ. కోతి తినలేక పోతోంది. అలిసిపోయాం దేమోనని సత్తెయ్య బలవంతంగా తినిపించాడు. కడుపునిండా తిని కోతిని గుండెల మీద పెట్టుకుని చెట్టుకింద పడుకుంటే సత్తెయ్యకి నిద్ర పట్టింది. నిద్రలేచి "నా దేవుడా, నా తండ్రీ, నా కొడకా" అని కోతిని పలకరిస్తే కోతి పలకలేదు. కంగారుగా చూశాడు సత్తెయ్య. కోతి సత్తెయ్యని ఒంటరివాణ్ణిచేసి వెళ్ళిపోయింది.

సత్తెయ్య చచ్చిపోయిన కోతిని గుండెలకి హత్తుకున్నాడు. నుదుట మళ్ళీ తిలకం దిద్దాడు. ఎక్కడో అడవిలో కట్టెలమోపు మీదికి దూకిందీ ఆ బుజ్జికోతి అని మోసుకొచ్చాడు. గొయ్యతీసి. మెత్తగా పనివాడని పడుకోబెట్టినట్టు పడుకోబెట్టి, ఆఖరిసారి కోతి మెడలో ముప్పలు కుదిలించి, పట్టి కప్పి, ఎదురుగా కూర్చుని వెదురుబద్దతో నేలమీద కొడ్తూ "తనకతనకజం.... రాములోరికి దణ్ణంపెట్టు సీతమ్మోరికి దణ్ణంపెట్టూ...." అంటూ రాత్రంతా పాడాడు.

మూడు రోజులు గడిచాయి. సత్తెయ్యకి ముద్దలేదు. కూలికి పోవటానికి ఓపికలేదు. ఓపికలేకపోయినా ఆకలి మంట ఆగదు.

ఉన్నట్టుండి లేచాడు సత్తెయ్య. వెదురుబద్ద తీసికొన్నాడు - ఇంటింటి ముందుకీ వచ్చాడు. "తనక తనకజం...." ఆడుతున్నాడు. తనే ఆడుతున్నాడు. తనే కోతయి, కోతిలా ఆడుతున్నాడు. కోతిలా రెండు చేతులూ నేల కానించి ఆడుతున్నాడు. "రాములోరికీ దణ్ణం పెట్టూ....సీతమ్మోరికి దణ్ణం పెట్టూ...." కోతిలా పళ్ళికిలిస్తున్నాడు. కోతిలా కిచకిచ లాడుతున్నాడు. కోతిలా శనగపప్పు తింటున్నాడు. కోతిలా మొగ్గలేస్తున్నాడు పల్టీలు కొడ్తున్నాడు. కోతిలా గాలిలోకి ఎగరలేక ఎగురుతున్నాడు.

అహా జనమంతా ఆట చూస్తున్నారు. కోతిఆట చూసినట్టే సత్తెయ్య ఆటకూడా చూస్తున్నారు.

ఆట చూస్తున్న అయ్యలారా! పిల్లలిగన్న తల్లుల్లారా! అమ్మలిగన్న అమ్మల్లారా! కోతిపాయం పొందిన దేవుళ్ళ కొలిచే దేవతల్లారా! సత్తెయ్య గొంతు చీరుకు పోయేట్టు పాడుతున్నాడే! ఎముకలు విరిగేట్టు ఆడుతున్నాడే! నెత్తురింకిపోయేట్టు ఎగురుతున్నాడే! కళ్ళముందు మనిషి జంతువుకంటే హీనమై పోతున్నాడే! కోతి ఆట చూపిట్టు ఆనందంగా పైపలేస్తున్నారా అయ్యల్లారా! ★

అమరావతి కథలు

సత్యం శంకరమంచి